# అపో॥ పౌలు గారు డేరాలు కుట్టి దేవుని సేవ చేసాడా ?

జీవము గల యావె నామమున సత్యాన్వేషులకు యాషువ పేరిట శుభములు ఏ అబద్ధమును సత్యసంబంధమైనది కాదు **(I యోహాను 2:21)** అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోకి బయలువెళ్లియున్నారు. **(I యోహాను 4:1)** వీరు గొర్రెల చర్మము వేసుకుంటారు లోపల క్రూరమైన తోడేళ్ల స్వభావం కలిగి ఉంటారు **(మత్తయి 7:15)** కనుక పరిసయ్యులు, సద్దూకయ్యులు వలె చేస్తున్న బోధను గూర్చి జాగ్రత్త పడాలి **(మత్తయి 16:12)** వీరు వేషదారులైన శాస్త్రులు పరిసయ్యులవలె, ఒకని తమలో కలుపుకొనుటకు సముద్రమును భూమిని సంచరింతురు. అతడు కలిసినప్పుడు అతనిని వారికంటే రెండంతలు నరకపాత్రునిగా చేయుదురు కాబట్టి అంధులైన మార్గదర్శకుల వలె **(మత్తయి 23:16,24,26)** ఉండక సత్యబోధయేదో అసత్యబోధయేదో జనులకు తెలియజేయాలి వీరు ప్రతిష్టితమైన దానికిని సాధారణమైన దానికిని బేధమెంచక, పవిత్రమైనదేదో అపవిత్రమైనదేదో తెలిసికొనుటకు జనులకు నేర్పరు. వట్టిసోదెగాండ్లయి జనులు కట్టిన మంటిగోడకు గచ్చుపూత పూయుదురు. **(యెహేజ్కేలు 22:26-28)** అందుకే దేవుడే - నా సేవకుడు తప్ప మరి ఎవడు గుడ్డివాడు ? నేను పంపు నా దూత తప్ప మరి ఎవడు చెవిటివాడు ? నా భక్తుడు తప్ప మరి ఎవడు గుడ్డివాడు? అని అంటున్నాడు. కనుక లోకమందు అనేక బోధలున్నను వాటిని విడిచి దేవుని చిత్తమైనబోధ అనగా దేవుడు సెలవిచ్చునదేదో, స్వబుద్ధిననుసరించి చేయుబోధయేదో **(యెహేజ్కేలు 13:3)** లేఖనములు పరిశోధించుచు యోగ్యులైయుండాలి. **(అపో 17:11)**

కొందరు పాస్టర్స్, ఎల్డర్స్ అపొస్తలుడైన పౌలు గార్ని, అకుల ప్రిస్కిల్లలను అడ్డంపెట్టుకొని లోకపరమైన అన్ని పనులు చేయటానికి, సంపాదించటానికి వెళ్తున్నారు. పౌలు గారు డేరాలు కుట్టలేదా ? **(అపో 18:3)**, స్వహస్తములతో పనిచేసి కష్టపడలేదా ? **(Iకొరింధి 4:12)** అక్కర కలిగియుండగా ఎవని మీద భారము మోపలేదు కదా ? **II కొరింధి 11:9**, ఎవనికిని భారముగా ఉండకూడదని ప్రయాసముతోను, కష్టముతోను దివారాత్రము పనిచేయుచు జీవనము చేయలేదా ? **(IIథెస్స 3:8)** అంటూ ఈ వాక్యములను అడ్డంపెట్టుకుంటున్నారు. ఇలాంటివారు దయచేసి ఈ వాక్యాలను మరల చదివి పరిశీలించాలని విన్నపించుకుంటున్నాను.

పౌలు గారు రోమా పరిపాలన కాలమందు ప్రధాన యాజకుల వలన అధికారం పొందిన వ్యక్తియైయున్నాడు. ఆ అధికారంతోనే మెస్సీయయే యాషువ అని బోధించే వారిని, యాషువను నమ్మిన శిష్యులను సేవకులను పట్టి బందించి శిక్షించుటకు దండించుటకును బెదిరించుటకును, హత్య చేయుటకును అధికారం పొంది **(అపో 9:1,2, అపో 26:10-12)** వెళ్తున్నపుడు పరిశుద్ధాత్మ ద్వారా తండ్రి పనికి అనగా సువార్త పనికి పట్టబడ్డాడు. అప్పడే తన అధికారమును బంధువులను అందరును అన్నిటిని విడిచి కత్తిపట్టుకున్న తన చేతులు పరిశుద్ధ గ్రంధం పట్టుకొని కేవలం తండ్రి సువార్త పనికి నియమింపబడ్డాడు. ఇపుడు ఈ సువార్త ప్రకటింపవలసిన భారము ఈయన మీద ఉంది ఈ సువార్తను ప్రకటించకపోతే ఈయనకు శ్రమ **(I కొరింధి 9:16)**

భూమి మిద ఒక అధికారం ఉందంటే అది దేవుని వలన కలిగినది తప్ప ఏ అధికారమును లేదు కనుక ప్రతివాడు పై అధికారులకు లోబడియుండాలి. ఈ అధికారులు దేవుని వలననే నియమింపబడ్డారు. అధికారమును ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించుచు, తమ మీదికి తామే శిక్షను తెచ్చుకొందురు. ప్రభుత్వము చేయువారు చెడ్డ కార్యములకే గాని మంచి కార్యములకు భయంకరులు కారు. నీవు చెడ్డది చేసిన యెడల భయపడుము. కీడు చేయువాని మీద ఆగ్రహము చూపుటకై వారు ప్రతికారము చేయు దేవుని పరిచారకులు ఏలయనగా వారు దేవుని సేవకులైయుండి యెల్లపుడు ఈ సేవయందే పని కలిగియుందురు. **(రోమా 13:1-6)** పనికలిగి యున్నారంటే ఈ పనిని దేనితో చేస్తున్నారు ? చేతులతో కాదా ? ప్రభుత్వ పనిచేస్తున్న ఈ అధికారికి ఆ ప్రభుత్వము వారు తగిన జీతం ఇస్తుంటేనే జీవనము సాగుతుంది కాదా ? ఉదాహరణకు గృహన్ని కట్టే ఒక వ్యక్తి గృహాన్ని నిర్మించటానికి ఇటుకలను ఒక దాని మీద ఒకటి చక్కగా అమర్చుతూ, సరిచేసుకుంటూ జాగ్రత్తగా చూచుకుంటూ తన స్వహస్తములతో కడితేనే ఆ గృహం నిలబడుతుంది. నిలబడిన ఆ గృహన్ని చూచి ఆ ఇంటి యజమానుడు సంతోషించి, తన హస్తాలతో కష్టపడి పనిచేసిన వ్యక్తికి తగిన జీతం ఇస్తాడు కదా ! దానితో ఆ వ్యక్తి జీవనం సాగుతుంది. ఇదే విధంగా దేవుడు అపోస్తులుడై పౌలు గారిని అన్యజనుల యెదుటను రాజుల యెదుటను ఇశ్రాయేలీయుల యెదుటను ప్రభువు నామాన్ని భరించుటకు ప్రభువు నామమున శ్రమలను అనుభవించుటకు తనకోసం ఒక సాధనముగా ఏర్పరచుకొన్నాడు.

**(అపో 9:14, 15)** అనగా ఒక పని ముట్టుగా వాడుకున్నాడు. ఆ దినము మొదలుకొని తన జీవితకాల పర్యంతము యాసువ మెస్సీయ కొరకు ఆయన నామమున సువార్త పని చేయుటకు నిలబడి అనేక సంఘాలను కట్టాడు. కట్టబడిన సంఘాల ద్వారానే చేతులతో చేసిన సువార్త పనికి జీతముగా పోషింపబడి జీవనం సాగించాడు. **(Iకొరింధి 9:14, ఫిలిప్పి 4:16,**

**II కొరింధి 11:9)** ఒక్కొక్కసారి ఒక సంఘాన్ని కట్టి వారికి పరిచర్య చేసినను, వారు పౌలుగారిని పోషించలేని స్థితిలో ఉన్నపుడు ఆయన వారిమీద భారముగా ఉండక, వారికి ఉచితముగా సువార్త ప్రకటించినను, తన స్వహస్తములతో కట్టబడిన వేరే సంఘాల వారు ఈయన ప్రతి అవసరతలను తీర్చారు. **(IIకొరింధి 11: 7-9), (ఫిలిప్పి 4:15, 16)**

లోకములోని ఎక్కువ భాగము జనులు పౌలుగారు, అకుల ప్రిస్కిల్లలు డేరాలు కుట్టి పనిచేసి జీవించారని అర్థం చేసుకొని పొరబడి అలాగే బోధిస్తున్నారు. వాస్తవానికి యూదులందరూ రోమాను విడిచివెళ్ళిపోవలెనని క్లౌదియ చక్రవర్తి ఆజ్ఞాపించినందున యూదులైన అకుల ప్రిస్కిల్లలు రోమాను విడిచి కొరింథుకు వచ్చినపుడు యూదుడైన పౌలుగారు **(అపో 21:39, అపో 22:3)** వీరిని కొనుగొని వారియొద్దకు వెళ్లెను. వారు వృత్తికి డేరాలు కుట్టువారు. పౌలు కూడా అదే వృత్తిగలవాడు గనుక వారితో కాపురముండెను. వారు కలిసి పనిచేయుచుండిరి. అని లేఖనము చెపుతుంది **(అపో 18:1-3)** ఇక్కడ వృత్తికి డేరాలు కుట్టువారని వ్రాయబడి ఉంది కాని ప్రస్తుతం కుట్టి, పనిచేసి జీవనం చేస్తున్నారని వ్రాయబడలేదు. దీనిని గమనించండి. ఇస్సాకు కుమారుడైన యాకోబు ఇశ్రాయేలుగా పిలువబడ్డాడు. అతని సంతానమే ఇశ్రాయేలీయులు. వీరు వృత్తికి గొర్రెల కాపరులు **(ఆది 46:31-34)**, యెష్షయి కుమారుడైన దావీదు యూదుడే. ఇతను కూడా గొర్రెల కాపరి **(Iసమూ॥ 17:12, Iసమూ 16:11)** ఈ దావీదు యావె చిత్తాను సారమైన మనస్సు గలవాడు గనుక యావె తన జనులమీద అతనిని అధిపతినిగా నియమించి అభిషేకించెను. నాట నుండి యావె ఆత్మ దావీదు మీదికి బలముగా వచ్చెను **(Iసమూ 13:14, సమూ 16:12,13)** కాబట్టి దావీదు ముప్పది యేండ్ల వాడై, ఇశ్రాయేలు వారిమీద యూదా వారిమీద రాజగుటకై పట్టాభిషేకము చేయబడ్డాడు. **(సమూ॥ 5:3-5)** ఆ తర్వాత రాజగు దావీదు తిరిగి గొర్రెలు కాయుటకు వెళ్లలేదనుసంగతి గ్రహించండి. ఈ దావీదు వంశంలోను గోత్రములోను పుట్టిన యూదుడైన యేసేపుకు కన్య మరియతో ప్రధానం చేయబడిన తర్వాత మరియ పరిశుద్ధాత్మ వలన గర్భవతియై, యాషువ (యేసు) అను కుమారుని కనెను. **(మత్తయి 1:20,21, లూకా 2:4)** వీరు వడ్రంగి వృత్తి కలిగిన వారు **(మత్తయి 13:55 : మార్కు 6 : 3)** యాషువ (యేసు) పన్నెండేండ్లవాడై యున్నపుడు ఆయన తల్లిదండ్రులు ఆయనను వెదుకుచున్నపుడు, ఆయన మీరేల నన్ను వెదుకుచుంటిరి ? నేను నా తండ్రి పనులమీద నుండవలెనని మీరెరుగరా? అని వారితో చెప్పెను గాని వారు ఆయన మాటలు గ్రహింపలేదు. అంతట యాషువ వారితో పాటు వచ్చి వారికి లోబడి యుండెను. **(లూకా 2:41-51)** ఇక్కడ లోబడియుండెనను మాటకు అర్థమేమిటంటే తల్లిదండ్రులు చేయుపనులన్నింటిని వారితో పాటు యాషువ కూడా చేసి వారికి లోబడినవి అర్థము. తండ్రి వడ్రంగి వాడు కనుక యాషువ కూడా వడ్రంగి పనులు చేసెనని అర్థం. యాషువ ముప్పది యేండ్ల వాడై పరలోకపు తండ్రి పనిచేయ ప్రారంభించిన తర్వాత **(లూకా 3:23)** తిరిగి ఈ లోకపు తండ్రి పనిచేయుటకు అనగా ఈ లోకపు పనులు చేయుటకు లోబడినట్లు పరిశుద్ధ గ్రంథమందు ఎక్కడా చూడలేము. ఇదే విధంగా అకుల ప్రిస్కిల్లలు పౌలుగారు వీరంతా వృత్తికి డేరాలు కుట్టువారే కాని, తండ్రి పనులు చేయుటకు నియమింపబడిన తర్వాత లోకపు పనులు మాని కేవలం తండ్రి పనిచేసారు. **(అపో 18:4, అపో 18:24-26)** పౌలు గారైతే అకుల ప్రిస్కిల్లలను యాషువ మెస్సీయ నందు నా జత పనివారు అనగా వీరు నా ప్రాణము కొరకు తమ ప్రాణములను ఇచ్చుటకైన తెగించి నాతోపాటు కలిసి యాషువ మెస్సీయ సువార్త పనులలో భాగస్తులని సాక్ష్యం తెలుపుచున్నాడు. **(రోమా 16:3,4) (Iకొరింధి 3:9, రోమా16:21, IIకొరింధి 8:23)** కనుక పౌలు కొరింథులో వాక్యము బోధించుచు ఒక సంవత్సరము ఆరు నెలలు అక్కడ నివశించి కొరింధి నుండి ఎఫెసు వచ్చువరకు అకుల ప్రిస్కిల్లలు పౌలు వెంట ఉన్నారు. **(అపో 18:11, 18,19)** కనుక అపో 18:3వ వచనములో “వారు కలిసి పనిచేయుచుండిరి” అను మాటకు అర్థమేమిటంటే దేవుని పనికి నియమింపబడిన పౌలు అకుల ప్రిస్కిల్లలు వీరందరు కలిసి లోకపు పనులైన డేరాలు కుట్టేపనిలో కాదు గాని దేవుని సువార్త పనిలో కలిసి పని చేశారని అర్థం. ఎందుకంటే దేవుని పనికి నియమింపబడిన సేవకులు కేవలం ప్రార్థన యందును వాక్య పరిచర్య యందును ఎడతెగక యుందురు **(అపో 6:4)** కాబట్టి పౌలు గారు ఎక్కడినుండో దేవుని సువార్త పని చేసుకుంటూ వచ్చి అకుల, ప్రిస్కిల్లలును కనుగొని వీరితో కలిసి కేవలం డేరాలు కుట్టే పనిచేసి బ్రతకడానికి వీరియొద్దకు వస్తాడా ? ఆలోచించండి.

యాషువ మెస్సీయ ఇంక చాలా రాత్రియుండగా ఆయన పెందలకడనే లేచి బయలుదేరి అరణ్య ప్రదేశమునకు వెళ్లి అక్కడ ప్రార్థన చేయుచుండెను. ఆయన శిష్యులు ఆయనను వెదుకుచూ, కనుగొని ఆయన యొద్దకు వెళ్లి అందరూ నిన్ను వెదుకుచున్నారని ఆయనతో చెప్పగా ఆయన నేను ఇతరమైన సమీప గ్రామములలోను ప్రకటించుటకు వెళ్లుదము రండి యిందు నిమిత్తమే గదా నేను బయటుదేరి వచ్చితినని వారితో చెప్పెను. **(మార్కు 1:35-38)** మరియు వారిని చూచి నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నదని వారితో చెప్పెను. **(యోహాను 4:34)** ఇక్కడ ప్రభువారు ఎందుకు వచ్చాడో, ఏ పని నిమిత్తము ఈలోకానికొచ్చాడో స్పష్టముగా క్లియర్‌గా చెపుతున్నాడు. తండ్రి పనిచేస్తున్న ఈయన తిరిగి లోకపరమైన పనికి వెళ్లి జీవనము చేసినట్లుగా పరిశుద్ధ గ్రంథములో ఎక్కడా చూడలేము. కాని ఆయన తన ఇష్టమును నెరవేర్చుకొనక తన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటకే అనగా తండ్రి యొక్క పనిని సంపూర్తి చేయుటకే పరలోకము నుండి దిగివచ్చాడు. **(యోహాను 6:38)** ఇది తండ్రి సేవకులకు మాదిరి ఇదే విధముగా పూర్వము దూషకుడు హింసకుడు హానికరుడైన పౌలుగారు దేవునిచేత కనికరింపబడి తన పరిచర్యకు నియమింపబడి నమ్మకమైన వానిగా ఎంచబడి యాషువ మెస్సీయలో బలపరచబడి **(Iతిమోతి 1:12,13),** ఆయన శ్రమలలో పాలివాడగుట యెట్టిదో యెరుగు నిమిత్తము సమస్తమును నష్టపరచుకొని, లోకములో ఏవేవి లాభకరములై యుండెనో వాటిని మెస్సీయ నిమిత్తము సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచు, తాను దేని నిమిత్తము యాషువ మెస్సీయ చేత పట్టబడినో దాని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాడు. **(ఫిలిప్పీ 3:5-12)** అందుకే పౌలు గారు నేను మెస్సీయను పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడని చెప్పుచున్నాడు **( Iకొరింధి 11:1)**

సైనికుడు యుద్ధమునకు పోవునపుడు తన్ను సైన్యంలో చేర్చుకొనిన వానిని సంతోష పెట్టవలెనని ఈ జీవన వ్యాపారములలో చిక్కుకొనడు గదా.. ఇదే విధముగా యాషువ మెస్సీయ యొక్క మంచి సైనికుని వలె పౌలుగారు యాషువ మెస్సీయ యొక్క సువార్త పనిలో మంచి పోరాటము పోరాడుతున్నాడు. ఎలాగంటే నేరస్థుడైయున్నట్టు ఆ సువార్త విషయమై సంకెళ్లతో బంధించబడి శ్రమపడుచున్నాడు. **(IIతిమోతి 2:3-9)** అంటే యుద్ధమునకు వెళ్లే వ్యక్తి యుద్ధం చేసి తిరిగివచ్చి ఈ లోకములోని పనికివెళ్ళి సంపాదించి ఆహారము పుచ్చుకొని తిరిగి మరల యుద్ధమునకు వెళ్లగలడా ? వెళ్లలేడు అలాగే ఆల్‌రెడి పౌలు గారు కూడా యుద్ధమనే ఈ సువార్త పనిలో సంకెళ్లతో బంధించబడిన ఈయన ఆ సంకెళ్లను తొలగించుకొని పనిచేసి తద్వారా ఆహారము పుచ్చుకొని తిరిగి ఆ సంకెళ్లతో బంధించబడటానికి వెళ్లగలడా ? ఒక్కసారి ఆలోచించండి. సువార్త పనిలో బంధించబడిన పౌలు గారు ఏ స్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొనియున్నాడు. దీనస్థితిలో సంపన్న స్థితిలో ప్రతి విషయములోను అన్ని కార్యములలోను కడుపునిండియుండుటకును, ఆకలి గొనుటకును సమృద్ధి కలిగి యుండుటకును లేమిలో ఉండుటకును నేర్చుకొన్ని యున్నాడు. **(ఫిలిప్పీ 4:11-12)** ఒక వేళ తాను జీవనోపాధి విషయమై చేతులతో పనిచేసినట్లైతే. ఆకలిగొని యుండు పరిస్థితి ఎందుకు వస్తుంది? ఆలోచించండి. వాక్యోపదేశము పొందువాడు ఉపదేశించువానికి మంచి పదార్థములన్నిటిలో భాగమియ్యవలెను. (గలతీ 6:6) గనుక ఉపదేశం పొందు సంఘాలన్ని వాక్యోపదేశము చేసిన పౌలు గారిని మంచి పదార్థములతో పోషించాలి. వారు పోషించలేని స్థితిలో ఉన్నపుడు వారికి భారముగా ఉండక వారి నుంచి ఏమి ఆశించక తన అవసరముల నిమిత్తము తనతో ఉన్న వారి నిమిత్తము తన చేతులతో దివారాత్రము ప్రయాసముతో కష్టపడి పనిచేసి జీవనము చేశారు. ఇక్కడ కష్టపడి పనిచేసారంటే లోకపరమైన పనికాదు గాని దేవుడే అప్పగించిన తన సువార్త పని అని అర్థం చేసుకోవాలి. వారు (సంఘాల వారు) పోషించకపోయినను ఎందుకు కష్టపడ్డారంటే, ఎవడైనను పనిచేయనొల్లని యెడల వాడు బోజనము చేయకూడదని మీకు ఆజ్ఞాపించితిమి గదా ! మీలో కొందరు ఏ పని చేయక పరులజోలికి పోవుచు అక్రమముగా నడుచుకొనుచున్నారని వినుచున్నాము. అట్టివారు నెమ్మదిగా పనిచేయుచు స్వంతముగా సంపాదించుకొనిన ఆహరము భుజింపవలెనని వారికి ఆజ్ఞాపిస్తూ మీరును ఈలాగు ప్రయాసపడి బలహీనులను సంరక్షింపవలెననియు “పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యత” అని ప్రభువైన యాషువ చెప్పిన మాటలు జ్ఞాపకము చేసికొనవలెనని అన్ని విషయములలో మీరు మమ్మును పోలినడుచుకోవాలని మమ్మును మేము మీకు మాదిరిగా కనపరచుకొనుటకే ఈలాగు చేసితిమని చెప్పారు. **(అపొ 20:33-35, II థెస్స 3:6-12)** మరియు వెలపటివారి యెడల మర్యాదగా నడుచుకొనుచు మీకేమియు కొదువలేకుండునట్లు మేము మీకు ఆజ్ఞాపించిన ప్రకారం మీరు పరుల జోలికి పోక మీ స్వంత కార్యములను జరుపుకొనుటయందును మీ చేతులతో పనిచేయుటయందును ఆశ కలిగి యుండవలెననియు, మిమ్ము హెచ్చరించుచున్నామని సంఘాలకు హెచ్చరించుచున్నారు.

**(I థెస్స 4:10-12)** ఎవరి పని వారు ఆశ కలిగి ఉండాలి కనుక పౌలుగారు కూడా బోజనము నిమిత్తము దేవుని పని పాడుచేయక **(రోమా 14:20)** శక్తి వంచనలేకుండా తనకప్పగించిన పనిలో సమర్థవంతముగా పనిచేసి విశ్వాసము కాపాడుకొంటూ, తన కొరకు ఉంచబడిన నీతి కిరీటము పొందటానికి అనుగ్రమం పొందాడు. **(II తిమోతి 4:7,8) షాలోం**

☞ **గమనిక-1 :** దేవుని పనికి ప్రతిష్టించబడిన సేవకులు దేవుని పనే చేయాలి. మరియు దేవుడు ఏ మనిషికి ఏ పని అప్పగిస్తాడో ఆ పనియందు ఆ మనిషి బాధ్యత కలిగి నమ్మకముగా యదార్థముగా పనిచేసి దీవించబడాలి. అయితే ఉజ్జియా యూదా జనులందరిమీద రాజుగా నియమించబడి, యావెదృష్టికి యదార్థముగా ప్రవర్తించి యావెను ఆశ్రయించి అతడు స్థిరపడు వరకు ఆశ్చర్యకరముగా యావె సహాయము పొంది వర్ధిల్లాడు గనుక అతని కీర్తిదూరము వ్యాపించెను **(2వ దిన. 26:1,4,5,15)** అతడు స్థిరపడిన తర్వాత మనస్సున గర్వించి చెడిపోయాడు. యావెకు దూపము వేయుటకై ప్రతిష్టించిన తన సేవకులు (యాజకులు) ఉండగా, గర్వించిన ఉజ్జియా దూపము వేయుటకు దూప కలశమును చేతపట్టుకొని మందిరములో ప్రవేశించగా, ఈ పనిచేయుటకు ఆయన సేవకులు ఉన్నారు. ఇది నీ పనికాదు. యావెకు ద్రోహయు చేసావు కనుక పరిశుద్ధ స్థలములో నుండి బయటికి పొమ్ము అని యాజకులు చెప్పినను వారి మాట వినక వారి మీద కోపము చూపి మందిరములో దూప పీఠము ప్రక్కనతడు ఉండగా, సేవకులు చూస్తుండగానే యావె చేత మొత్తబడి నొసట కుష్ఠరోగము పొంది, చివరకు ప్రజలకు రాజుగా ఉండే అర్హతను పోగొట్టుకున్నాడు. **(2వ దిన. 26:16-21)** కాబట్టి బలులు అర్పించుటకంటే ఆజ్ఞను గైకొనుటయు పొట్టేళ్ల క్రొవ్వు అర్పించుటకంటే మాట వినుటయు శ్రేష్టము **(I సము॥ 15:22)** కనుక రాజు చేయవలసినపని రాజే చేయాలి సేవకుడు చేయవలసిన పని సేవకుడే చేయాలి. ఒకవేళ సేవకుడు చేసే పనిని ఇతరులు ఎవరైనను అనగా చివరికి రాజైన సరే చేయకూడదు. అలా చేస్తే అది వారి అవివేకపు పని అవుతుంది. మరియు అతని విషయమై యావె పశ్చాత్తాప పడతాడు. చివరకు నీకు అప్పగించిన పనిని నీ దగ్గిర నుండి తీసివేరే వ్యక్తికి అప్పగిస్తాడు **(I సమూ॥ 13:11-14, I సమూ॥ 15:11, 26, 28)** మరియు యావె సేవకుడు బీదవాడైనను లేక ధనవంతుడైననూ, జ్ఞానమున్నను. జ్ఞానములేనివాడైన, పామరుడైనను లేక విద్యావంతుడైననూ సేవకుడు సేవకుడే. అతను గొప్పవాడే కనుక యావె చేతిలో చావకుండునట్లు యావెకు పరిచర్య చేయుటకు నిలుచు సేవకుని (యాజకుని) మాటను వినాలి **(ద్వితి 17:12)**

☞ **గమనిక -2 :** దేవుని సేవ చేసే వ్యక్తి ఆ సేవ వలననే జీవిస్తాడు. **(I కొరింథి 9:7,8, 13,14)** దేవునిపనికి తగిన (జీతము) ఆహారము పొందుకుంటాడు **(మత్తయి 10:10)**

☞ **గమనిక - 3 :** దేవుని పిలుపునుబట్టి సమస్తము విడిచిపెట్టి దేవుని పనిచేసే వారే దేవుని సేవకులు అవుతారు. కాని కొందరు ఉద్యోగము అనే అధికారం పొంది, రిటైర్డ్ అయిన తర్వాత ఆ అధికార స్వభావముతో దేవుని సేవ చేయాలనుకొంటారు. మరి కొందరూ ఈ లోకపు పనులతో సంపాదిస్తూ, ఆ ధన బలముతో ఉన్న జ్ఞానముతో 'పాస్టర్' అనిపించుకొనుటకు దేవుని సేవ చేయాలనే సొంత తలంపులతో ముందుకొస్తున్నారు. ఈ సహోదరులకి కానుకలు, దశమ భాగములు తీసుకొనే అర్హతలేదు. **(సంఖ్య 18:20-26)**

## పరిశుద్ధ గ్రంధం కంటె పెద్ద బోధకులు ఈ భూమి మీద లేరు


**సంప్రదించు చిరునామా:**

సువార్తికుడు. **నామా పౌలు**

జీవము గల యావె సమాజ అధ్యక్షులు

**జీవము గల యావె సమాజము**

ఇ.నెం. 4-1-646 /2, రోటరీనగర్, ఖమ్మం.

సెల్: 90000 96616, 90000 94939

E-mail: livingyahweh@gmail.com


**స్థానిక సమాజ చిరునామా :**


www.livingyahweh.org